క్లుప్తంగా

దద్దాలకు సన్మానం



దద్దాల నారాయణ యాదవ్‌ను సన్మానిస్తున్న ఆర్యవైశ్య యూత్

కనిగిరిరూరల్: వైఎస్సార్ సీపీ కనిగిరి ఇన్‌చార్జి డాక్టర్ దద్దాల నారాయణ యాదవ్‌ను పట్టణ ఆర్యవైశ్య యువత నాయకులు శనివారం రాత్రి కలిశారు. స్థానిక పార్టీ కార్యాలయంలో దద్దాల నారాయణ యాదవ్‌కు యూత్ నాయకులు గణేశుని చిత్రపటాన్ని అందచేసి ఘనంగా సన్మానించారు. ఆర్యవైశ్య నాయకులు తడికి మళ్ల వెంకటేశ్వర్లు, బచ్చు వెంగళరావు గుప్తా, రాచర్ల నరేష్, గోనుగొంట రామ్ కుమార్, అయితా మహేంద్రా, గుంటూరు విజయ్ కుమార్ పాల్గొన్నారు.

పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలి



టంగుటూరులో మొక్కలు నాటుతున్న కలెక్టర్ రాజాబాబు

టంగుటూరు: పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలని కలెక్టర్ రాజాబాబు అన్నారు. స్థానిక బాపూజీ కాలనీలో నిర్వహిస్తున్న స్వచ్ఛాంధ్ర..స్వర్ణాంధ్ర కార్యక్రమంలో కలెక్టర్ ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. పల్లెల్లో పచ్చదనం, పారిశుధ్యం పెంపొందించేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని సూచించారు. ప్లాస్టిక్ నిర్మూలన సమాజంలో ప్రతి ఒక్కరి బాధ్యతన్నారు. అనంతరం మొక్కలు నాటారు. మంత్రి స్వామి, ఆర్డీఓ లక్ష్మీ ప్రసన్న, తహసీల్దార్ ఆంజనేయులు, డ్వామా పీడీ జోసఫ్ కుమార్, డీపీఓ వెంకటేశ్వరరావు, డీడీ లక్ష్మానాయక్, దేపీఓ మాచర్ల, ఇన్‌చార్జి ఎంపీడీఓ రామసుబ్బారావు, సింగరాయకొండ సీఐ చావా హజరత్తయ్య, ఎస్సై నాగమల్లేశ్వరరావు పాల్గొన్నారు.

బకాయిల రికవరీ వేగవంతం చేయండి

హనుమంతునిపాడు: వెలుగు పథకం ద్వారా డ్వాక్రా సంఘాల సభ్యులు తీసుకున్న స్త్రీ నిధి బకాయిలు త్వరితగతిన రికవరీ చేయాలని పీడీ టి.నారాయణ సీసీలు, వీఓలకు సూచించారు. స్థానిక వెలుగు కార్యాలయాన్ని శనివారం సాయంత్రం ఆయన తనిఖీ చేశారు. ఈసందర్భంగా డ్వాక్రా సంఘాల సభ్యులు తీసుకున్న రుణాల రికార్డులు పరిశీలించారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ స్త్రీ నిధి బకాయిలు రూ.90 లక్షలు ఉందన్నారు. సీఐఎఫ్ రూ.25లక్షలు, ఉన్నత లోన్లు తీసుకున్న సభ్యుల నుంచి బకాయిల రికవరీలు తగ్గాయన్నారు. గ్రామాల్లో గ్రామ సంఘాలకు సమావేశాలు ఏర్పాటు చేసి నూరుశాతం రికవరీలు చేయాలన్నారు. ఏపీఎం పి.రజనీకుమారి, సిబ్బంది అశోక్, సంపత్‌కుమార్, తినకమ్మ, సునీత, డానియల్ , గ్రామ సంఘాల అధ్యక్ష, కార్యదర్శులు, వీఓఏలు పాల్గొన్నారు.

జాతీయ రహదారిపై వాహనాల తనిఖీ

పామూరు: పామూరు సమీపంలోని 565 జాతీయ రహదారిపై సీఐ ఎం భీమానాయక్ ఆధ్వర్యంలో ఎస్సై కిషోర్‌బాబు, సిబ్బంది శనివారం విస్తృత తనిఖీ చేపట్టారు. ఈ సందర్భంగా వాహనాల తనిఖీపై సీఐ భీమానాయక్ సూచన లు చేశారు. వాహనాల్లో ఏమైనా నిషేధిత వస్తువులు తరలిస్తున్నారా, లైసెన్స్ కలిగి ఉన్నారా, అక్రమ మద్యం తరలిస్తున్నారా అని తనిఖీ చేపట్టారు. నిషేధిత వస్తువులు తరలిస్తే కఠిన చర్యలు చేపడతామని సీఐ, ఎస్సైలు హెచ్చరించారు.

23న మండల సమావేశం

జరుగుమల్లి(సింగరాయకొండ): జరుగుమల్లి మండల సమావేశం ఈ నెల 23న స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ రమణమూర్తి ఒక ప్రకటనలో తెలిపారు. సమావేశానికి ప్రజాప్రతినిధులు, మండల, గ్రామస్థాయి అధికారులు పాల్గొనాలని ఆయన కోరారు.

నీరు లేక నిరుపయోగం..!



పాకలలో సింగరాయికొండ రోడ్డులో కుంట పక్కన నిరుపయోగంగా పశువుల తొట్టి



కలికవాయి చెరువు సమీపంలో నిర్మించిన పశువుల నీటి తొట్టి

- మండలంలో 18 పశువుల నీటితొట్ల నిర్మాణం
- నీటితొట్లను ఎవరు నీటితో నింపాలనే దానిపై సందిగ్ధత
- రూ.లక్షలు ఖర్చు చేసి నిర్లక్ష్యంగా వదిలేసిన వైనం
- అధికారుల తీరుపై సర్వత్రా విమర్శలు

సింగరాయకొండ: శాఖలు, అధికారుల మధ్య సమన్వయ లోపంతో లక్షల రూపాయల ప్రజాధనం వృథాగా మారింది. అధికారులు మాకు సంబంధం లేదంటే మాకు సంబంధం లేదంటూ చేతులు దులుపుకోవడంతో నిరుపయోగంగా మారి అధికారుల నిర్లక్ష్యాన్ని వెలెత్తి చూపిస్తున్నాయి. వివరాల్లోకి వెళితే..పశువులకు తాగునీటి ఎద్దడి తీర్చే లక్ష్యంతో పల్లె పండుగ 2025–26 కార్యక్రమంలో భాగంగా గ్రామాల్లో ఉపాధి హామీ పథకంనిధులతో పశువుల తొట్లను నిర్మించారు. ఒక్కో పశువుల తొట్టిని రూ.25 వేల వ్యయంతో మండలంలోని పలు గ్రామాల్లో 18 నీటి తొట్లు నిర్మించారు. అయితే ఎంతో ఆర్భాటంగా హడావుడిగా వీటి నిర్మాణం పూర్తి చేయించిన అధికారులు ఆ తరువాత వాటిని గాలికి వదిలేశారు. ఆ తొట్లను ఎవరు నీటితో నింపాలి, ఎవరు పర్యవేక్షించాలనే దానిపై స్పష్టత కరువైంది. దీంతో అధికారులు మాకెందుకు అన్నట్లు తప్పించుకొని తిరుగుతున్నారు. ఉపాధి హామీ నిధులతో నిర్మించడం వరకే మా పని అన్నట్లు ఆ శాఖ అధికారులు పట్టించుకోవడం లేదు.

పట్టించుకునేదెవరు..?

మండలంలో పాకల, కనుమళ్ల, కలికవాయ, బింగినపల్లి, ఊళ్లపాలెం, సోమరాజుపల్లి, పాతసింగరాయకొండ గ్రామాల్లో నీటి తొట్ల నిర్మాణం చేపట్టారు. పశువులకు నీటి ఎద్దడి లేకుండా వీటిని నిర్మించినా అవి ప్రస్తుతం గ్రామాల్లో నిరుపయోగంగా దర్శనమిస్తున్నాయి. తొట్లను నిర్మించిన తరువాత గ్రామ పంచాయతీలకు అప్పగించాలని సూచించారు. అయితే వీటిని పంచాయతీ నిధులతో నిర్వహించాల్సి ఉన్నా స్పష్టమైన ఆదేశాలు లేవంటూ ఆ శాఖ అధికారులు పట్టీపట్టనట్లు వ్యవహరిస్తున్నారు. ఇప్పటికైనా మండల అధికారులు స్పందించి ప్రభుత్వ లక్ష్యం నెరవేరి పశువుల దాహార్తి తీరేలా చర్యలు తీసుకోవాలని పశుపోషకులు కోరుతున్నారు.

పరిసరాల పరిశుభ్రత ప్రతి ఒక్కరి బాధ్యత



ఇనుప విద్యుత్ పోల్‌ను పరిశీలిస్తున్న చైర్మన్ గఫార్

కనిగిరిరూరల్: పరిసరాల పరిశుభ్రత ప్రతి ఒక్కరి బాధ్యత అని మున్సిపల్ చైర్మన్ ఎస్‌కే అబ్దుల్ గఫార్ అన్నారు. స్వచ్ఛాంధ్ర, స్వర్ణాంధ్ర కార్యక్రమంలో భాగంగా శనివారం పురపాలక సంఘం ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా చైర్మన్ గఫార్ మాట్లాడుతూ ప్లాస్టిక్ వాడకం వలన కలిగే నష్టాల గురించి వివరించారు. కమిషనర్ పిల్లి కృష్ణమోహన్ రెడ్డి మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ పర్యావరణ పరిరక్షణలో భాగస్వాములు కావాలన్నారు. ప్లాస్టిక్ రహిత పట్టణంగా మార్చేందుకు అందరూ సహకరించాలన్నారు. శానిటరీ ఇన్‌స్పెక్టర్ నాయబ్ రసూల్, చెన్నకేశవులు, వివిధ సంస్థల ప్రతినిధులు పాల్గొన్నారు.

నూతన విద్యుత్ స్తంభాల ఏర్పాటుకు చర్యలు

పట్టణంలోని అన్ని వార్డుల్లో శిథిలావస్థలో ఉన్న విద్యుత్ స్తంభాలు, ఇనుప స్తంభాల మార్పుకు చర్యలు తీసుకుంటామని మున్సిపల్ చైర్మన్ ఎస్‌కే అబ్దుల్ గఫార్ అన్నారు. పట్టణంలో శనివారం పలు వార్డుల్లో పర్యటించారు. స్థానిక ఒంగోలు బస్టాండ్ దర్గా వద్ద ప్రమాదకర స్థితిలో ఉన్నా ఇనుప విద్యుత్‌పోల్ తొలగించి, కొత్త పోల్‌ను ఏర్పాటు చేయాలని స్థానికులు చైర్మన్‌కు విన్నవించారు. పోల్‌ను పరిశీలించిన చైర్మన్ తక్షణ చర్యలు తీసుకుంటామని వెల్లడించారు. జహీర్, గౌస్ బాషా, రఫీ, ఖాదర్, సాధిక్, నాయబ్ రసూల్ తదితరులు పాల్గొన్నారు.

రాజోలుపాడు అభివృద్ధికి కృషి చేస్తాం

పొన్నలూరు: ప్రధానమంత్రి ఆదర్శ గ్రామ యోజన ద్వారా ఎంపికైన రాజోలుపాడు పంచాయతీ అభివృద్ధికి కృషి చేస్తామని ఎంపీడీఓ డాక్టర్ సుజాత అన్నారు. మండలంలోని రాజోలుపాడు ఎస్సీ కాలనీలో శనివారం సర్పంచ్ మార్తాల వెంకటేశ్వరరెడ్డి అధ్యక్షతన గ్రామసభ ఏర్పాటు చేసి పలు అభివృద్ధి పనులుకై తీర్మానం చేశారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ మాట్లాడుతూ గ్రామంలోని దళిత ప్రజల జీవన ప్రమాణాలు పెంపొందించడానికి పీఎంఏజీవై ద్వారా కేంద్ర ప్రభుత్వం ప్రత్యేక నిధులు మంజూరు చేస్తుందన్నారు. మొదటిగా సుమారు రూ.20 లక్షలతో ఎస్సీ కాలనీలో అంతర్గత రహదారులు, కాలువ నిర్మాణం, సామాజిక భవనం, తాగునీటి వసతులు ఏర్పాటు చేస్తామన్నారు. అనంతరం గ్రామంలో మొక్కలు నాటారు. ఈఓఆర్డీ సుబ్రహ్మణ్యం, కార్యదర్శి రవణమ్మ, గ్రామస్తులు పాల్గొన్నారు.

ఇతర రాష్ట్రాల మద్యం అమ్మకాలపై గట్టి నిఘా




ఎక్సైజ్ స్టేషన్‌లో రికార్డులు తనిఖీ చేస్తున్న ఎక్సైజ్ అసిస్టెంట్ కమిషనర్ విజయ

కనిగిరిరూరల్: దసరా పండుగను పురస్కరించుకొని అక్రమ మద్యం అమ్మకాలు, ఇతర రాష్ట్రాల మద్యం అమ్మకాలపై గట్టి నిఘా ఏర్పాటుచేయాలని ఎక్సైజ్ అసిస్టెంట్ కమిషనర్ కె.విజయ సూచించారు. స్థానిక ఎక్సైజ్ కార్యాలయాన్ని శనివారం ఆకస్మిక తనిఖీ చేశారు. స్టేషన్‌లో రికార్డులు పరిశీలించి ఇప్పటి వరకు నమోదైన కేసుల వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా అసిస్టెంట్ కమిషనర్ మాట్లాడుతూ నూతన మద్యం పాలసీ విధానం అమల్లోలోకి వచ్చినప్పటి నుంచి నమోదు చేసిన కేసుల్లో చార్జ్‌షీట్‌లు కోర్టులో నమోదు చేయాలని ఆదేశించారు. అనుమానితులపై బైండోర్ కేసులు నమోదు చేయాలని, గంజాయి, ఇతర మత్తు పదార్థాలు, నాటు సారా అమ్మకదారుల పైనా, తయారీదారులపైన గట్టి నిఘా ఏర్పాటు చేయాలని ఆదేశించారు. కనిగిరి ఎక్సైజ్ స్టేషన్ పరిధిలో ఇప్పటి వరకు 53 కేసులు, 778 మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకొని సీజ్ చేసినట్లు సీఐ ఆర్ విజయభాస్కర్‌రావు వెల్లడించారు. అసిస్టెంట్ ఎక్సైజ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ సూపరిండెంట్ ఏ జనార్దన రావు, పోలీస్ అధికారులు పాల్గొన్నారు.

వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలి

పొన్నలూరు: గ్రామాల్లో నిర్వహిస్తున్న వైద్య శిబిరాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని పీహెచ్‌సీ డాక్టర్ రవికిరణ్ అన్నారు. మండలంలోని మాలపాడులో శనివారం వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేసి రోగులకు ఆరోగ్య పరీక్షలు చేపట్టి మందులు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సీజనల్ వ్యాధులపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలన్నారు. వ్యాధులు సోకకుండా నివాస ప్రాంతాలను నిత్యం పరిశుభ్రంగా ఉంచాలన్నారు. సీహెచ్‌ఓ భాస్కర్‌రావు, పీహెచ్‌ఎన్ గిరిజ, అంగన్‌వాడీలు, ఆశాలు, ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

ఉత్తమ అవార్డు గ్రహీతలకు సన్మానం



అవార్డు గ్రహీతలను సన్మానిస్తున్న విద్యాశాఖ అధికారులు

కనిగిరిరూరల్: నియోజకవర్గంలోని వివిధ మండలాల్లో ఉత్తమ అవార్డులు పొందిన ఎంఈఓలను, ప్రధానోపాధ్యాయులను ఉపాధ్యాయులు స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాల ఆవరణలో ఘనంగా సన్మానించారు. ఎంఈఓల సంఘం జిల్లా అధ్యక్షుడు దేవిరెడ్డి రామిరెడ్డి అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో మార్కాపురం, ఒంగోలు ఉప విద్యాశాఖ అధికారులు మామిళ్లపల్లి శ్రీనివాసులరెడ్డి, చంద్రమౌళీశ్వరరావు, గిరిధర శర్మలు పాల్గొని మాట్లాడుతూ విధి నిర్వహణలో అంకితభావంతో పనిచేసిన వారికి తప్పక గుర్తింపు లభిస్తుందన్నారు. అనంతరం ఎంఈఓలు, హెచ్‌ఎంలు జి.సంజీవి, టి.పెద్దిరెడ్డి, నాగలక్ష్మి, బి.సరోజని, ఈశ్వరి, నాగభూషణం, ఎస్‌వీఎల్ నరసింహారావు, బి.సుజాతలను ఉపాధ్యాయులు ఘనంగా సన్మానించారు. ఎంఈఓలు డీవీ సుబ్బారావు, నారాయణరెడ్డి, వై కరుణకుమారి, జె.ప్రసాద్‌రావు, బరిగి నరసింహారావు, శివాజీ, హెచ్‌ఎంలు విజయభాస్కర్‌రెడ్డి, జి.కోటిరెడ్డి, విజయలక్ష్మి, పద్మావతి, రమాశ్రీ, కేవీ రత్నమ్మ, సాంబ, నారాయణరెడ్డి, ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

సత్తా చాటిన మర్లపాడు విద్యార్థులు

టంగుటూరు: స్థానిక ప్రభుత్వ పాఠశాలలో జరిగిన మండలస్థాయి స్కూల్ గేమ్స్‌లో మర్లపాడు విద్యార్థులు సత్తా చాటారు. కబడ్డీ, ఖోఖో, బ్యాడ్మింటన్, చెస్ పోటీల్లో అండర్ 14, 17 విభాగాల్లో సత్తా చాటారు. ప్రతిభ చాటిన విద్యార్థులను ప్రధానోపాధ్యాయుడు వెంకటచలపతిరావు, ఉపాధ్యాయులు, కార్యాలయ సిబ్బంది అభినందించారు. ఈ సందర్భంగా పీడీ కౌసల్య మాట్లాడుతూ మండలస్థాయిలో విజేతలు డివిజన్ స్థాయి పోటీల్లో పాల్గొంటారన్నారు.

వర్మీ కంపోస్టు తయారీపై అవగాహన

హనుమంతునిపాడు: రైతులకు వర్మీ కంపోస్టు తయారీపై శనివారం కూటాగుండ్ల, దాసళ్లపల్లి గ్రామాల్లో అవగాహన కల్పించారు. వ్యవసాయ శాఖ, ఆత్మ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ప్రదర్శన క్షేత్రంలో ఏఓ రవికుమార్ వర్మీ కంపోస్టు నిర్వహణ పద్ధతులపై అవగాహన కల్పించారు. ఆత్మ బ్లాక్ టెక్నాలజీ మేనేజర్ సురేఖ వ్యవసాయ సహాయకులు ఆంధ్రాకాశయ్య, మాల్యాద్రి, రైతులు పాల్గొన్నారు.

మద్యం తాగి వాహనాలు నడిపితే జైలుకే..

టంగుటూరు: మద్యం తాగి వాహనాలు నడిపితే కేసు నమోదు చేసి జైలుకు పంపుతామని సింగరాయకొండ సీఐ చావా హజరత్తయ్య హెచ్చరించారు. స్థానిక టోల్ ప్లాజా వద్ద జాతీయ రహదారి పోలీసులు, సిబ్బందితో కలిసి శనివారం ముమ్మరంగా తనిఖీలు నిర్వహించారు. ఈ చలానా ద్వారా రూ.7,500 చలానా విధించారు.

రైల్వేస్టేషన్ అభివృద్ధి పనుల పరిశీలన



సోమరాజుపల్లి రైల్వేగేటు సామర్థ్యాన్ని పరిశీలిస్తున్న ఆజనేయరెడ్డి

సింగరాయకొండ: స్థానిక రైల్వే స్టేషన్‌లో సుమారు రూ.25 కోట్ల అంచనా వ్యయంతో జరుగుతున్న అభివృద్ధి పనులను సౌత్ సెంట్రల్ రైల్వే ప్రిన్సిపల్ చీఫ్ ఇంజినీర్ డి.ఆంజనేయరెడ్డి శనివారం మధ్యాహ్నం పరిశీలించారు. ప్రత్యేక రైలులో వచ్చిన ఆయన రైల్వేస్టేషన్‌లో జరుగుతున్న అభివృద్ధి పనులను పరిశీలించారు. చివరగా రైల్వే ట్రాక్ సామర్థ్యాన్ని పరిశీలించి సిబ్బంది తగిన సూచనలు ఇచ్చారు.

సమతుల్య ఆహారంతో సంపూర్ణ ఆరోగ్యం

పామూరు: సమతుల్య ఆహారంతోనే సంపూర్ణ ఆరోగ్యం సాధ్యమని ఐసీడీఎస్ ఏసీడీపీఓ పి.లావణ్య అన్నారు. మండలంలోని దూబగుంట్ల, రావిగుంటపల్లె గ్రామాల్లో శనివారం పోషకాహార మాసోత్సవాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఏసీడీపీఓ పి.లావణ్య, పీహెచ్‌సీ డాక్టర్లు షేక్.దాదా షరీఫ్, డాక్టర్ రవళి ప్రియాంక మాట్లాడుతూ ప్రతిరోజు ఆహారంలో చిరుధాన్యాలు, ఆకుకూరల వాడకం పెంచాలన్నారు. క్యాన్సర్ వ్యాధిపై అవగాహన కలిగి ఉండాలని, స్క్రీనింగ్ ద్వారా తగు జాగ్రత్తలు తీసుకోవచ్చన్నారు. బిడ్డలకు విధిగా తల్లిపాలే ఇవ్వాలని సూచించారు. కార్యక్రమంలో ఐసీడీఎస్ సూపర్‌వైజర్ గోళ్ల పద్మజ, ఎంపీఎస్ పార్వతి, పలువురు పాల్గొన్నారు.

కేజీబీవీ పాఠశాలకు సౌండ్‌బాక్స్ అందజేత



సౌండ్‌బాక్స్ అందజేస్తున్న గురవయ్య, వరుణ్‌కుమార్

సీఎస్‌పురం(పామూరు): కస్తూర్బాగాంధీ బాలికా విద్యాలయానికి వైఎస్సార్ సీపీ టీయూసీ జిల్లా అధ్యక్షుడు మితికాల గురవయ్య, ఆయన కుమారుడు మితికాల వరుణ్‌కుమార్ రూ.25 వేల విలువైన సౌండ్‌బాక్స్‌ను ప్రిన్సిపాల్ రేష్మకు అందజేశారు. రాష్ట్ర మానవహక్కుల సంఘం అధ్యక్షుడు డాక్టర్ షేక్.గౌస్, టీయూసీ జిల్లా మాజీ అధ్యక్షుడు మేకల బాలుయాదవ్, పందిటి వెంగళరావు పాల్గొన్నారు.



వెంకటేశ్వర స్వామి దేవస్థానం



నందనమారెళ్ల బాలకోటేశ్వర స్వామి దేవస్థానం

దసరా ఉత్సవాలకు ఆలయాలు ముస్తాబు

కనిగిరిరూరల్: దసరా బ్రహ్మోత్సవాలకు ఆలయాలు ముస్తాబవుతున్నాయి. ఈ నెల 22 సోమవారం నుంచి వచ్చే నెల 2వ తేదీ గురువారం వరకు దసరా ఉత్సవాలు నిర్వహించనున్నారు. ఈ నేపథ్యంలో స్థానిక గార్లపేట రోడ్డులోని శ్రీదేవి, భూదేవి సమేత, వెంకటేశ్వర స్వామి దేవస్థానంలో ప్రత్యేక పూజలు నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ నిర్వాహకులు తెలిపారు. ప్రతి రోజు ఉదయం 6 గంటల నుంచి విశిష్ట పూజలు, ఉదయం 9 గంటలకు స్వామి కల్యాణోత్సవాలు జరుగుతాయని, ప్రతి రోజు రాత్రి 7 గంటలకు పల్లకి సేవ శోభాయమానంగా జరుగుతాయని, ప్రతి రోజు మధ్యాహ్నం అన్నదానం ఏర్పాటు చేశామన్నారు. 22న సోమవారం 8 గంటలకు ధ్వజారోహణం, గరుడాళ్వారు పూజ, 29న సోమవారం మూలా నక్షత్రం సందర్భంగా సరస్వతీ దేవాలయంలో విద్యార్థులచే సామూహిక సరస్వతీ పూజలు జరుగుతాయన్నారు. మండలంలోని నందనమారెళ్ల బాల కోటేశ్వరీ సహిత బాల కోటేశ్వర స్వామి దేవస్థానంలో ఈ నెల 22 నుంచి వచ్చే నెల 2 వరకు విశిష్ట పూజలు, హోమాలు నిర్వహించనున్నట్లు ఆలయ ప్రధాన అర్చకులు వినుపాముల రామకృష్ణశర్మ తెలిపారు.

శాశ్వత అంగన్‌వాడీ భవనాలు ఏర్పాటు చేయాలి

- డీఆర్‌ఓకు వినతిపత్రం అందజేసిన ఎంపీపీ వాకా



ఆర్డీఓకు వినతిపత్రం అందజేస్తున్న ఎంపీపీ వాకా వెంకటరెడ్డి

మర్రిపూడి: మండలంలోని కూచిపూడి, మర్రిపూడి సెక్టార్ పరిధిలో అంగన్‌వాడీ కేంద్రాలకు శాశ్వత భవనాలు ఏర్పాటు చేయాలని ఎంపీపీ వాకా వెంకటరెడ్డి ఒంగోలు ఆర్డీఓ ఓబులేసుకు శనివారం వినతిపత్రం అందజేశారు. ఐసీడీఎస్ పరిధిలోని రెండు సెక్టార్లలో అంగన్‌వాడీ కేంద్రాలు ఉన్నాయని, అందులో 14 అంగన్‌వాడీ కేంద్రాలకు శాశ్వత భవనాలు లేకపోవడంతో కార్యకర్తలు అద్దె భవనాల్లో విధులు నిర్వర్తిస్తూ అగచాట్లు పడుతున్నారని తెలిపారు. గ్రామాల్లో ఖాళీగా ఉన్న ప్రభుత్వ భూములను గుర్తించి స్థలం కేటాయించి శాశ్వత భవనాలు ఏర్పాటు చేయాలని వినతిపత్రం అందజేశారు.

పడిపోతున్న లోగ్రేడ్ పొగాకు ధరలు

- కేజీ రూ.100కు చేరిన లోగ్రేడ్ పొగాకు ధర
- కొనసాగుతున్న బేళ్ల తిరస్కరణ

కొండపి: స్థానిక పొగాకు వేలం కేంద్రంలో లో గ్రేడ్ పొగాకు ధరలు రోజు రోజుకు దిగజారుతున్నాయి. వేలం ప్రారంభంలో పొగాకు కనిష్ట ధర కేజీ రూ 260తో వేలాన్ని ప్రారంభించారు. 12వ రౌండ్ వేలానికి చివరికి వచ్చేసరికి రూ.100కి పడిపోయింది. రోజు రోజుకు ధరలు దిగజారుతుండటంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. మరో వైపు వేలం ముగింపు దశకు చేరుకున్నా తిరస్కరణ బేళ్ల సంఖ్య తగ్గడం లేదు. నిత్యం వందల సంఖ్యలో బేళ్లను తిరస్కరించారు. బేళ్లను వేలానికి తీసుకొని రావడానికి ఒక్కో బేలుకు దాదాపు రూ.1500 ఖర్చవుతుందని, గిట్టుబాటు ధర లేక అల్లాడుతుంటే ఇంకా అదనపు భారం ఏంటని రైతులు వాపోతున్నారు. ప్రభుత్వం అధికారులు స్పందించి పొగాకు గిట్టుబాటు ధర కల్పించి,వేలానికి తీసుకొని వచ్చే అన్ని బేళ్లను కొనుగోలు చేయాలని కోరుతున్నారు.

339 బేళ్లు తిరస్కరణ

స్థానిక పొగాకు వేలం కేంద్రంలో శనివారం నిర్వహించిన వేలంలో 339 బేళ్లు తిరస్కరణకు గురైనట్లు వేలం నిర్వహణ అధికారి సునీల్ కుమార్ తెలిపారు. క్లస్టర్ పరిధిలోని కామేపల్లి, పచ్చవ గ్రామాలకు చెందిన రైతులు 1179 బేళ్లను వేలానికి తీసుకురాగా 840 బేళ్లను కొనుగోలు చేసి 339 బేళ్లను తిరస్కరించారు. గరిష్ట ధర రూ.346, కనిష్ట ధర రూ.100, సరాసరి ధర రూ.231.71గా నమోదైంది. వేలంలో 17 కంపెనీల ప్రతినిధులు పాల్గొన్నారు.

టంగుటూరు: స్థానిక పొగాకు వేలం కేంద్రంలో శనివారం జరిగిన వేలంలో 184 బేళ్లను తిరస్కరించారు. వేలానికి ఎం నిడమానూరు గ్రామానికి చెందిన రైతులు 999 బేళ్లను తీసుకురాగా 815 బేళ్లను కొనుగోలు చేసి 184 బేళ్లను తిరస్కరించారు. గరిష్ట ధరరూ.346, కనిష్ట ధర రూ.110, సరాసరి ధర రూ.271.11 పలికింది.